గోకులాలకు నిధుల విడుదల..

- 1212 గోకులాలకు రూ.10.50 కోట్లు
- ఆరు నెలలుగా ఎదురుచూపులు
- లబ్ధిదారుల్లో ఆనందం..

మండలంలో బిల్లుల కోసం ఎదురుచూస్తున్న గోకులం షెడ్డు లబ్ధిదారులు

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

ఉపాధి హామీ చట్టంలో గోకులం షెడ్లు నిర్మించిన పాడి రైతులకు ప్రభుత్వం ఆరు నెలల తర్వాత ఎట్టికేలకే నిధులు విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఎక్కువమంది పాడి పరిశ్రమపైన ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి హామీ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోకుల షెడ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టింది.

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే నవంబర్ నెలలో పాడి రైతులు ఉన్న వారికి గోకులాలు, మినీ గోకులాలు పెద్దఎత్తున మంజూరు చేసింది. చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో 2327 గోకులం షెడ్లను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్లను పెద్ద ఎత్తున మంజూరు చేసింది. పాడి రైతులకు తోడ్పాటును అందించేలా గోకులం షెడ్ల నిర్మాణాన్ని చేపట్టింది. గోకులం షెడ్ల నిర్మాణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. పశువులకు శాశ్వతమైన షెడ్లు నిర్మించాలని ఎన్నో ఏళ్లకు ఎదురుచూస్తున్న రైతులకు గోకుల షెడ్లు నిరుపేదలకు ఓ సువర్ణ అవకాశం.

ఉపాధి హామీ ద్వారా గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆరు పశువులు ఉన్న వారికి రూ.2,30,000లు యూనిట్ విలువ నిర్ణయించింది. ఉపాధి నిధులు రూ.2,07,500, రైతు వాటా రూ.23,000లు పది శాతంగా నిర్ణయించింది. నాలుగు, రెండు, పశువులు ఉన్నవారికి గోకులం షెడ్లు మంజూరు చేసింది. రైతు వాటా పది శాతం లబ్ధిదారుడే భరించాల్సి ఉంటుంది. గోకులం షెడ్లు నిర్మించిన లబ్ధిదారులకు రైతు వాట 10 శాతం ను తగ్గించి ఉపాధి హామీ పథకంలో మిగిలిన 90 శాతం నిధులను గోకులం షెడ్డు నిర్మించిన పాడి రైతు బ్యాంకు అకౌంట్ వ్యక్తిగత ఖాతాకు నిధులు నేరుగా జమవుతాయి. గోకులం షెడ్లు ప్రారంభంలో 317 గోకులం షెడ్లకు రూ.1.75 కోట్ల బిల్లులు చెల్లించింది. జనవరి తరువాత గోకులం షెడ్లను నిర్మించుకున్న రైతులు, లబ్ధిదారులు ఆరు నెలలుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఎట్టకేలకు జిల్లాలో పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి అయిన 1212 గోకులాలు, మినీ గోకులాలకు రూ.10 కోట్ల 15 లక్షల బిల్లుల చెల్లింపునకు అనుమతులు ఇచ్చింది.

చిత్తూరు జిల్లాలోని 31 మండలాలలోని ఉపాధి హామీ కార్యాలయాల్లో గోకులం షెడ్లు నిర్మాణం పూర్తయిన బిల్లులు, ఎఫ్‌టిఓలను ఏపీఓ లాగిన్లు అప్లోడ్ చేశారు. ఉపాధి హామీ కింద నిర్మించిన గోకులాల బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ఎంపీడీవో లాగిన్‌లో అప్లోడ్ చేస్తున్నారు. గత రెండు రోజులుగా 31 మండలాల్లో ఉపాధి హామీ కార్యాలయంలో గోకులం షెడ్ల బిల్లులు అప్లోడ్ చేస్తున్నడంతో సాంకేతిక సమస్యలు రావడంతో బిల్లులు అప్లోడ్ చేయడం ఆలస్యం అవుతున్నది.

నిధుల విడుదల పాడి రైతులకు చేయూత..
- పత్తిపాటి భగవతి, సర్పంచ్ ఓటివారిపల్లి, పాడి రైతు

గోకులం షెడ్ల నిధుల విడుదల పాడి రైతులకు ఎంతో చేతనిచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా పాడి పశువులకు శాశ్వతంగా షెడ్లు నిర్మించాలనే కల నెరవేరింది. కూటమి ప్రభుత్వం గోకులాలు మంజూరు చేయడంతో పాడి రైతులు ఆర్థికంగా, అభివృద్ధి చెందేందుకు ఎంతో ఉపయోగం. గోకులం షెడ్లు నిడుదులు విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

వారం రోజులో బిల్లులు చెల్లిస్తాం..
- ఆవాసాని రవికుమార్, ఉపాధి హామీ సంచాలకులు

గోకులం షెడ్డు బిల్లులు చెల్లింపులకు రూ.10 కోట్ల 15 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ చట్టం కింద ఎవరైతే గోకులాలు, మినీ గోకులాలు నిర్మాణాలు పూర్తి చేశారో వారికి 100శాతం నిధులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నేరుగా జమవుతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారదర్శకత విధానం కోసం నూతనంగా ప్రవేశపెట్టిన ఎస్.పి.ఎ.ఆర్.ఎస్.హెచ్. యాప్ ద్వారా బిల్లులను అప్లోడ్ చేస్తున్నాం. గత రెండు రోజులుగా చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో ఎంపీడీవో లాగిన్‌లో గోకులం షెడ్ల బిల్లులు అప్లోడ్ 70శాతం మేర పూర్తి చేశాం. మిగిలిన 30 శాతం పూర్తి చేయాల్సి ఉంది. వారం రోజుల్లో గోకులం షెడ్ల బిల్లులు లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమవుతాయి. గోకులం షెడ్డు లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తాం

పేదల అవసరాలు అదునుగా వడ్డీ వ్యాపారం చేసే వారి పై కఠిన చర్యలు : ఏపిఎస్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్

- శిరీషకు రూ.5లక్షలు చెక్కు అందజేత
- కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 50 సెంట్ల భూమి కేటాయింపు
- పిల్లల చదువు బాధ్యత తీసుకున్న ప్రభుత్వం

బాధిత మహిళ శిరీషతో మాట్లాడుతున్న కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్

చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీ పరిధి 2వ వార్డుకు చెందిన శిరీష పట్ల జరిగిన సంఘటన అమానవీయమని, బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని ఏపిఎస్ ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం పేర్కొన్నారు. దుర్ఘటనపై తీసుకున్న చర్యలపై కడ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఏపిఎస్ ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్, కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ వివరించారు. బుధవారం కడ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ముఖ్యమంత్రి తరపున శిరీష రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏపిఎస్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ కుప్పంలో శిరీష పట్ల జరిగిన దుర్ఘటన మానవత్వం తలదించుకునే ఉందని తెలిపారు. బాధితురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, పిల్లలు చూస్తుండగానే తల్లిని చెట్టుకు కట్టేసి కర్కశత్వంతో కొట్టారని తెలిపారు. వడ్డీ వ్యాపారులు పేదల ఆర్థిక అవసరాల అదును చూసుకుని రూ.10ల అంతకంటే ఎక్కువ వడ్డీలు వసూలు చేస్తున్నారని, ఇకపై అన్యాయంగా వడ్డీ వ్యాపారం చేసే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోన్ ద్వారా స్వయంగా బాధితురాలిని పరామర్శించారని, నేరస్థులను విడిచిపెట్టమని హామీ ఇచ్చారన్నారు. బాధితురాలి కుటుంబాన్ని ఆదుకునేలా రూ.5లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేస్తామని, పిల్లల చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కూడా ఫోన్ ద్వారా పరామర్శించి నేరస్థులను కఠినంగా శిక్షించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు అన్యాయం జరిగితే ప్రభుత్వ స్పందించే తీరు, అందించే సత్వర న్యాయాలకు ఇది నిదర్శనం అన్నారు. బాధితురాలి పిల్లల్లో ఒకరిని విజలాపురంలోని గురుకుల పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. కడ పిడి మాట్లాడుతూ బాధితురాలు శిరీషకు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 50 సెంట్ల భూమి కేటాయింపుకు అసైన్డ్ కమిటీ తీర్మానించడం జరిగిందన్నారు. ఈ దుర్ఘటన పై ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, జిల్లా ఎస్పి ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారని తెలిపారు. బాధితురాలికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు చేపడతామన్నారు.

పిల్లలకు చెక్కును అందిస్తున్న ఏపిఎస్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మునిరత్నం, కడ పీడీ వికాస్ మర్మత్

ప్రస్తుత ధరలు స్థిరంగా కొనసాగింపు..

జిల్లాలో 27 ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా 42 వేల టన్నులు తోతాపురి మామిడి సేకరణ
రైతులు ఆందోళన చెందవద్దు..: జిల్లా ఇంచార్జ్ కలెక్టర్

గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

జిల్లాలో నేటి వరకు 27 ప్రాసెసింగ్ యూనిట్‌ల ద్వారా దాదాపు 42 వేల టన్నుల తోతాపురి మామిడి సేకరించడం జరిగిందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ జి.విద్యాధరి తెలిపారు. పూతలపట్టు మండలం వడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామసభలకు హార్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డితో పాటు ఇంచార్జ్ కలెక్టర్ హాజరై గుజ్జు పరిశ్రమలకు మామిడి కాయల తరలింపుపై అవగాహన కల్పించారు. గ్లోబల్ ఫామ్స్ వద్ద ప్రాసెసింగ్ యూనిట్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుని 92 మంది రైతులకు మామిడి అమ్మకం కొరకు టోకెన్లు మంజూరు చేశారు. తోతాపురి మామిడి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే ప్రాసెసింగ్ యూనిట్‌లకు తరలించాలని తెలిపారు. మండలాల్లో గ్రామసభల ద్వారా మామిడి అమ్మకంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మామిడి రైతులకు సలహాలు, సూచనల కొరకు ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్ట్‌ల వారీగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. మామిడి రైతుల సందేహాలు నివృత్తికి హెల్ప్ లైన్ నెంబర్ 08572- 242777, 94910 77325లకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తపై వైసీపీ నేత దాడి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళపై జరిగిన దాడి మరవకముందే రాగిమానుమిట్ట గ్రామంలో మరో మహిళపై జరిగిన దాడి వెలుగు చూడడంతో నియోజకవర్గ ప్రజలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మహిళలపై జరుగుతున్న వరుస దాడులను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వాటి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాగిమానుమిట్ట గ్రామానికి చెందిన నస్మా అను మహిళపై అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, మండల కోఆప్షన్ సభ్యుడు అత్తర్ బుధవారం దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయమై బాధితురాలు మాట్లాడుతూ స్థానిక అంగన్వాడీ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్న తనపై వైసిపి నాయకులు రాజకీయ కక్ష పెంచుకున్నట్టు ఆరోపించారు. గత ప్రభుత్వంలో వైసిపి నాయకుడు అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న తనను ఉద్యోగం నుండి తీసివేస్తానంటూ మనోవేదనకు గురి చేసినట్టు తెలిపారు. నిందితుడి చిత్రహింసలను భరించలేక తాను ఆత్మహత్యాయత్నం సైతం చేసినట్లు తెలిపారు. ఆనాటి నుండి తనపై కక్షభూనీన అత్తర్, అతని భార్య, సోదరినితో కలిసి తన భర్త ముందే దాడి చేసినట్టు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్న తాము సమస్య పరిష్కారానికి పంచాయతీ మంచినీటి పైపుకు గేట్‌వాల్ బిగించడం జరిగిందన్నారు. అయితే పాత కక్షాలను మనసులో ఉంచుకున్న నిందితులు నీటి సమస్యలు సాకుగా చూపుతూ తనపై దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో కత్తులు చేతపట్టి తనను చంపడానికి ప్రయత్నించారని, తన భర్త అడ్డుపడకపోయి ఉంటే తన ప్రాణాలు పోయేవని భయాందోళనకు లోనయ్యారు. తనపై దాడి జరగడంతో తన కుటుంబ సభ్యులు వైద్యసేవలను నిమిత్తం తనను కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందన్నారు. తనపై జరిగిన దాడిని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, తన ఫిర్యాదుపై పూర్తి విచారణ జరిపి తమకు పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు నస్మా

కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నస్మా పరామర్శించిన టిడిపి నాయకులు

బాధితురాలిని పరామర్శించిన టిడిపి నాయకులు

కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నస్మాను కడా కమిటీ సభ్యులు డాక్టర్ సురేష్ బాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులను విచారించారు. అనంతరం బాధితురాలికి మనో ధైర్యాన్ని కల్పిస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరపున బాధితురాలికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం పరిధిలో మహిళలపై జరుగుతున్న దాడులు దారుణమని, ఆడవారిపై దాడులను టిడిపి అధినేత సహించేది లేదన్నారు. శిరీష పై జరిగిన ఘటనలో ప్రభుత్వం స్పందించిన తీరు ఇందుకు నిదర్శనమన్నారు. అంగన్వాడీ కార్యకర్త నస్మాపై భౌతిక దాడులకు తెగబడ్డ వ్యక్తి వైసిపి మండల కో ఆప్షన్ సభ్యునిగా కొనసాగుతున్న అత్తర్ అని, ఇతను ఎమ్మెల్సీ భరత్ అనుచరుడని వారు ఆరోపించారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన వైసిపి అరాచకం సృష్టిస్తోంది అనడానికి ఇది నిదర్శనమన్నారు. టిడిపి నాయకులు కన్నన్, బాబు, రాజారామ్, రాజ్ కుమార్, ప్రేమ్ కుమార్, వెంకటేష్, సత్యేంద్ర పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు

కుప్పంలో అంగన్వాడీ వర్కర్స్ నస్మాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని ఆమెకు రక్షణ కల్పించాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అంగన్వాడీలు రకరకాల సమస్యలతో సతమతమవుతుంటే ఇలాంటి దాడులతో మరో పక్క ఇబ్బందులకు పడుతున్న పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా రాము

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ప్రజా రవాణా అధికారిగా రాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో పనిచేస్తూ బదిలీపై చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు చిత్తూరు జిల్లాలో పలమనేరు డిపో మేనేజర్‌గా, డిప్యూటీ ట్రాఫిక్ చీఫ్ మేనేజర్‌గా పనిచేశారు. ప్రజలకు సురక్షితమైన మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయడమే తన లక్ష్యమని తెలిపారు. అన్ని ఆర్టీసీ బస్సు స్టేషనులను అన్ని రకాలుగా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : కడా పీడీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే కడా లక్ష్యమని కడా పీడీ వికాస్ మరమ్మత్ తెలిపారు. కడా కార్యాలయంలో బుధవారం పీడీ ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పీడీ దృష్టికి తీసుకురావడం జరిగింది. ప్రజలు అందించిన వినతులలో పింఛన్లు, భూమి, ఉద్యోగ, ఆరోగ్య సమస్యలు అధికంగా ఉన్నట్టు తెలిపారు. వీటిలో అధికశాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వినతులను పరిశీలించి, శాఖల వారీగా కేటాయిస్తూ, సమస్యలను త్వరితగతి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

కుప్పం ఎంఈఓ సస్పెన్షన్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం ఎంఈఓ మహబూబ్ బాషాను సస్పెండ్ చేస్తున్నట్టు ఆర్జెడి శామ్యూల్ ఆదేశాలు జారీ చేశారు. సస్పెండ్‌కు గురైన ఎంఈఓ తన విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని, కుప్పం పట్టణానికి చెందిన హాకింగ్ పాఠశాల విషయంలో ఎంఈఓ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డట్టు ఆర్జెడి ఉత్తర్వులలో పేర్కొన్నారు. కుప్పం ఎంఈఓ సస్పెండుకు గురి కావడంతో గుడుపల్లి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా జూన్ నెల 20వ తేదిన శుక్రవారం జీడినెల్లూరులోని ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే జాబ్ మేళాలను ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జాబ్ మేళాలకు సంబందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని పంచాయతీ వార్డు సచివాలయాలోని పరిధిలో ఉన్న ఉద్యోగార్థులను గుర్తించి వారికీ సమాచారం చేరవేయాలని కోరారు. అదేవిధంగా ఇందులో దాదాపు 20 కంపెనీలు 1000 ఖాళీలతో విచ్చేయుచున్నాయని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి నుండి డిగ్రీ మరియు పీజీ ఫెయిల్/పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్ రెడ్డి, ఎంపీడీవో హెచ్ డోనప్ప, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 126 మంది ఎంపిక

శాంతిపురం: స్థానిక ఐటిఐ కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 126 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో 8 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని, 160మంది శిక్షణ విద్యార్థులు హాజరయ్యారని, వీరిలో 126 మంది విద్యార్థులు వివిధ కంపెనీల ద్వారా ఎంపిక చేయబడ్డారని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, కంపెనీలకు నైపుణ్యాలున్న శిక్షణార్థులను అందించడంలో కీలకమైన దశగా నిలిచిందని తెలిపారు. హిందాల్కో కుప్పం నుండి వెన్నెల, స్కైబర్ డైనమిక్ కుప్పం నుండి వినీత్, సాహి ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ నుండి వంశీకృష్ణ, అమర్ రాజా బ్యాటరీస్ (బంగారుపాల్యం) నుండి జగదీష్, ఆపినల్ బెంగళూరు నుండి హరీష్ తదితర కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.

శాంతిపురం ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా..

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం వ్యవసాయ అధికారులు రైతులకు వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రైతుల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, జీడీ నెల్లూరు నియోజకవర్గంలో అధిక శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగించేవారు ఎక్కువ మంది ఉన్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతులకు 977 మంది రైతులకు కోటి 67 లక్షల రూపాయలను చిన్న, సన్నకార రైతులకు సబ్సిడీతో వివిధ రకాల పనిముట్లను అందించడం జరిగిందన్నారు. రైతులు వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిత్తూరు మేయర్ అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏవో భవాని, ఎంపీడీవో కృష్ణ మహేష్ రెడ్డి, తహశీల్దార్ తులసీరామ్, టిడిపి నాయకులు కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, దేవ సుందరం, హరీష్ యాదవ్, కోదండ రెడ్డి, జ్యోతి యాదవ్, జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

తల్లికి వందనం దేశంలోనే ఆదర్శం: ఎమ్మెల్యే

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందజేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ఎంతమంది పిల్లలు చదువుకుంటూ ఉన్నారో వారందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. అదేవిధంగా గంగాధర నెల్లూరు మండలం ముక్కులతూరు కాలనీలో (ఎంజి ఎన్ఆర్ ఈజీఎస్) పథకం ద్వారా అంబోదరపల్లి రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు రూ.80 లక్షలతో నిర్మించ తలపెట్టిన నూతన తారు రోడ్డుకి శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమం చేసి పనులను ప్రారంభించారు.

మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

వాకింగ్ ట్రాక్‌ల వద్ద డ్రోన్ నిఘా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరులోని కట్టమంచి, పివికేఎన్ కళాశాల గ్రౌండ్, గంగినేని చెరువు, జింకల పార్క్, మెకానికల్ క్రీడా మైదానం ప్రాంతాల్లో ప్రతి రోజు వాకింగ్ చేసే సమయంలో డ్రోన్ నిఘా ఉంటుందని మహిళల భద్రతే ద్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తుందని అనుమానాస్పద కదలికలు ఉన్న సందర్భాల్లో వెంటనే గుర్తించి, పోలీసులు తక్షణమే స్పందించేలా ఉపయోగపడుతుందని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో కాసేపు వ్యాయామం చేసేందుకు సమీపంలోని పార్కులు, వాకింగ్ ట్రాక్లను ఆశ్రయిస్తుంటారు. పార్కులు వాకింగ్ ట్రాకుల్లో కూడా భద్రత కరువై మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వారం రోజుల క్రితం కట్ట మంచి చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద ఉదయం 6 గంటల సమయంలో వాకింగ్ చేసేందుకు వచ్చిన ఓ మహిళ మెడలో చైన్ చోరీకి గురైంది. మహిళలు, యువతులు ర్యాగింగ్‌కు గురవుతున్నారు. వాకింగ్ ట్రాక్లు పార్కుల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని వాకర్ అసోసియేషన్ ఎప్పటినుండో విజ్ఞప్తి చేస్తోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాలు అందించింది. జింకల పార్క్ వద్ద ఆకతాయిల వేధింపులు, చైన్స్ స్నాచింగ్‌లను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యంత్రాంగం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం డ్రోన్ కెమెరాల నిఘా నిఘా ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 19వ తేదీ గురువారం నుండి మహిళల భద్రత కోసం చిత్తూరు జిల్లా పోలీసుల ప్రత్యేక చర్యలలో భాగంగా డ్రోన్ నిఘా ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వెళ్లే మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆయా ప్రాంతాల్లో డ్రోన్‌ల సహాయంతో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

స్వేచ్ఛగా వ్యాయామం చేసేందుకే..

ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వెళ్లే మహిళలు నిస్సంకోచంగా, భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా వ్యాయామం చేసేందుకు అనుకూలమైన, భద్రమైన వాతావరణం కల్పించేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నారు. డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో చిత్తూరు పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో వాకింగ్ చేసే మహిళల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడింది. ఇందులో భాగంగా ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో మహిళల రక్షణ కోసం సేవలు అందించనున్నారు.

వృత్తిపరమైన వృద్ధి అవసరం

మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: ప్రతి విద్యార్థికి వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి అవసరమని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంసివి డిగ్రీ కళాశాల ఆవరణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ సంయుక్తంగా జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వారివారి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, తన సామర్థ్యాలను పెంచుకోవచ్చు అన్నారు. ఇది వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధికి అవసరం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ జాబ్ మేళా కార్యక్రమంలో 17 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయని, 183 మంది హాజరు కాగా 87 మంది ఉద్యోగ అవకాశాలు పొందినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృది అధికారి ఎం.గుణశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి దోణప్ప , ఏపీఎస్ ఎస్‌డిసి జిల్లా ప్లేసేమెంట్ అధికారి చైతన్య, సీడప్ ఏపీ జిల్లా ప్లేసేమెంట్ అధికారి లోకేష్, పవన్ కుమార్, వేణు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రూపేష్, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అండగా ఉంటా..

రైతులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి- జీడీ నెల్లూరు: నియోజకవర్గంలో జైన్ జ్యూస్ ఫ్యాక్టరీకి మామిడికాయలు తీసుకువచ్చిన రైతులకు, డ్రైవర్లకు ప్రభుత్వ విప్ జీడి నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ విఎం థామస్ అన్నం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మామిడి రైతులను కూటమి ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని, రైతులకు అండగా ఉంటామని, రైతులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. మామిడి కొనుగోళ్లపై కొంతమంది రైతులకు తప్పుడు సమాచారాన్ని దుశ్రప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మకండి అని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కృష్ణమ నాయుడు, చంగల్ రాయ్ యాదవ్, మురళి, కృష్ణమ నాయుడు, ఇందిరమ్మ, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన వి.ఎల్.కె.కుమార్ చిత్తూరు టు డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. కర్ణాటక రాష్ట్రంలోని హొస్కోట వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాలతో బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం స్వగ్రామంలో దహన క్రియలు చేశారు. బుధవారం గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ స్థానిక టిడిపి నాయకులతో కలిసి మృతుడు కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థికసహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట నరసింహ నాయుడు, నియాజ్ అలీ, జీవరత్నం, నీరజాక్షలరెడ్డి, శాంత కుమార్, శంకర్, సంపత్, రాఘవేంద్ర, అతేహర్ అలీ, ఫీరోజ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు): యాదమరిలోని సుచి జోడిచింతల కార్యాలయంలో బుధవారం సంతానం లేని భార్య భర్తలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంకు 40 మంది భార్యాభర్తలు హాజరై వైద్య చికిత్సలు పొందారని సుచి స్వచ్ఛంద సంస్థ అధినేతలు పాల్ విజయ్ కుమార్, గ్లోరీ విజయ్ కుమార్ తెలిపారు. సారల్ ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ ఐశ్వర్య వారిచే సంతానం లేని భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చి పరీక్షలు నిర్వహించడమే కాకుండా వారిని సారల్ ఫెర్టిలిటీ సెంటర్‌కు రెఫరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ విగ్నేష్, సిబ్బంది సుమిత్ర, అమల, సురేందర్, సూచి సిబ్బంది శ్యామ్సన్, ఆనంద్ కుమార్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

ప్రజాశక్తి- పలమనేరు: వివిధ శాఖల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై పలమనేరు ఏఎ ఎన్జీజీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు ఆధ్వర్యంలో తిరుపతికి వచ్చిన రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర కార్యదర్శి బివి.రమణలను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు అమలుకావాల్సిన పీఆర్సీ, మధ్యంతర భృతి, కరువు భత్యం, సరెండర్ లీవ్, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాల చెల్లింపు, తదితర బకాయిల మంజూరులో తీవ్ర జాప్యం, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు, సచివాలయ ఉద్యోగులకు బదిలీలో స్వంత మండలం నిబంధన తొలగింపు, నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు, మెడికల్ ఉద్యోగుల బదిలీలలో అవకతవకలు తదితర అంశాలపై చర్చించారు. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం రాజీలేని పోరాటం చేయనున్నట్లు రాష్ట్ర నాయకులు స్పష్టం చేశారు. జిల్లా ఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.రమణ, పురుషోత్తం పాల్గొన్నారు.

కూర్నిపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- గంగవరం: మండలం కేంద్రమైన కూర్నిపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏడిఏ శివకుమార్, మండల వ్యవసాయ అధికారి రఖీబా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడిఏ మాట్లాడుతూ ఖరీఫ్ 2025 సీజన్లో సాగు చేసే పంటల సస్యరక్షణ, విత్తన శుద్ధి, కలుపు మందులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం తోతాపూరి మామిడికి ఒక్కొక్క కేజీకి రూ.4లు మద్దతు ధర ప్రకటించడం జరిగిందని, రైతులు పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే తీసుకురావాలని, ఈ కొనుగోలు ప్రక్రియ ఆగస్టు నెలాఖరి వరకు ఉంటుందని తెలిపారు. రైతులు ఒక క్రమ పద్ధతిలో కాయల కోత నిర్వహించాలని పక్వానికి రాని కాయలు కోసి తీసుకువెళ్లడం వలన సరైన ధర ఉండదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్కే ఇంచార్జ్, రైతులు పాల్గొన్నారు.

ఎస్వి ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల: హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీనివాస అనిద్రుత్ బుధవారం టిటిడి శ్రీ వెంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు ఆయన తరపున ఆయన ప్రతినిధి వై.రాఘవేంద్ర తిరుమలలోని టిటిడి అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.



- ఆర్‌బికెల్లో యూరియా నిల్వలు నిల్
- అన్నదాతలను పీడిస్తున్న కొరత

ప్రజాశక్తి - ఏర్పేడు : ఈ ఏడాది విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడం, ముందుగానే రుతుపవనాలు ప్రవేశించడంతో అన్నదాతలు సంతోషంతో మే 15 నుంచే దుక్కులు దున్నడం ప్రారంభించారు. పంట ఏపుగా పెరిగేందుకు నత్రజని కీలక పాత్ర పోషిస్తుంది. అందుకోసం యూరియా వినియోగం తప్పనిసరి. ఈ కారణంగానే యూరియాకు డిమాండ్ అధికం. గత ఖరీఫ్ సీజన్లో అధిక ఉష్ణోగ్రతల వలన నీటి ఎద్దడి ఏర్పడడంతో రైతులు పంటలు వేయడానికి అంతగా మొగ్గు చూపలేదు. నైరుతి రుతు పవనాలు చాలా ఏళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలోనే రావడం వలన పంట సాగుకు నీటి ఎద్దడి నుండి రైతులు ఉపశమనం పొందుతున్న తరుణంలో అన్నదాతలు ఉత్సాహంగా పలు గ్రామాలలో సగం మంది రైతులు మే నెల ఆఖరిలోపే నాట్లు వేశారు.

ఏర్పేడు మండలంలో 19 సచివాలయాలకు గాను 17 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బి కే సెంటర్స్) ఉన్నప్పటికీ యూరియా నిల్వలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏర్పేడు, పాపా నాయుడుపేట, పల్లాం ప్రాంతాలలో ఎరువుల విక్రయాల ఏజెన్సీలు ఉన్నా కావలసినంత యూరియాను రైతు సోదరులకు అందించడం లేదని వాపోతున్నారు. ఎందుకు తెప్పించటం లేదని ఏజెన్సులను ప్రశ్నించగా రవాణా చార్జీలు అధికంగా ఉన్నాయని యజమానులు కుంటి సాకులు చెబుతున్నారని రైతులు మండిపడుతున్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు తగిన రీతిలో ఎరువును అందించక పోవడంతో దీనిని అదునుగా తీసుకొని కొందరు ప్రైవేట్ ఎరువుల విక్రయదారులు మార్కెట్ రేటు కంటే అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. బస్తా యూరియా రూ.286 నుంచి 300 వరకూ విక్రయిస్తున్నారు.

నగదు చెల్లించి ముందుగా నమోదు చేసుకోవాలి

గతంలో కొంతమేర యూరియాను రైతు భరోసా కేంద్రాలకు తెప్పించి ఆయా పరిధిలోని రైతులకు సమాచారాన్ని అందించడంతో రైతులు నగదు చెల్లించిన తర్వాత విక్రయాలు చేపట్టేవారు.ప్రస్తుతం ఆ పద్ధతికి వ్యతిరేకంగా ముందస్తుగా రైతు భరోసా కేంద్రాలలో రైతులు నగదు చెల్లించి నమోదు చేసుకుంటేనే వారం పది రోజుల తర్వాత యూరియాను తెప్పించి రైతులకు అందజేస్తున్నారు. ఈ సమస్య వలన రైతులు యూరియా కొరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. రైతులు ఎదురు చూడలేక ప్రైవేటు ఏజెన్సీల వద్దకు వెళ్లినా యూరియా దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ఎరువులు కొనాల్సిందే : శివ, రైతు, అముడూరు

రైతు భరోసా కేంద్రాలలో యూరియా ముందుగా తెప్పించట్లేదు. ఒకవేళ యూరియా కావాలంటే ముందుగా నగదు చెల్లించి బుక్ చేసుకోవాలి. ఒక లారీ లోడ్ యూరియాని రైతులంతా కలిసి బుక్ చేసుకుంటే ఎప్పటికో తెప్పిస్తున్నారు. అవసరానికి ఉపయోగపడట్లేదు. సరేలే అనీ ఎరువుల దుకాణాలకెళితే నీకు యూరియా కావాలంటే భాస్వరం ఎరువుల గాని, పురుగు మందులు గాని కొంటేనే ఇవ్వగలమని నిర్మొహమాటంగా ఏజెన్సీ యజమానులు చెబుతున్నారు.

సకాలంలో వేయాలి : మహేష్, రైతు, ఎండి పుత్తూరు

నేను ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి నాటాను. మొదటిదఫా ఎరువులు వేయాల్సి ఉంది. ఎకరాకు ఒక బస్తా చొప్పున ఐదు ఎకరాలకు ఐదు బస్తాల యూరియా కావాలి. రైతు భరోసా కేంద్రానికి వెళితే ఆలస్యం అవుతుందన్నారు. ఏజెన్సీల వద్దకు వెళితే వేరే మందులు కొనాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లోనూ ఇదే పరిస్థితి.

విత్తనాలను పంపిణీ చేస్తున్న మురళి నాయుడు

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- పూతలపట్టు: ప్రభుత్వం సబ్సిడీలో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు గుంటూరు మురళి నాయుడు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు పంపిణీ చేయాలని అధికారులను కోరారు. సర్పంచ్ మాసిలమని, మాజీ కన్వీనర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన దాసరి కులస్తులు

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాసరి కులాల విన్నపాన్ని మన్నించి వారి మనోభావాలను గౌరవించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్ర అధ్యక్షుడు రవిదాసరి ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం రాష్ట్ర దాసరి రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు రవిదాసరి ఆధ్వర్యంలో మండలంలోని దాసరి కులస్తులందరూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో దాసరి కుల ధ్రువీకరణ పత్రంలో దాసరి బీసీ–ఏగా గుర్తించి అందులో భిక్షాటన, బెగ్గింగ్ అనే పదాలు ఉండేవన్నారు. వీటివలన తమ మనోభావాలు గాయపరిచే విధంగా ఉన్నందున వీటిని తొలగించాలని గత వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఈ పదాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతో ఇటీవల ఆ మేరకు జీవో విడుదలైందని తెలిపారు. కార్యక్రమంలో కోలా సురేంద్ర, కె నాగరాజ్, నాయుడు, శంకర్, హరి, విజయ్ పాల్గొన్నారు.

'భూమిని కాపాడండి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం మొగలివారిపల్లి పంచాయతీలో సర్వే నెంబర్ 270లో రెండు ఎకరాల 77 సెంట్లు భూమిని కబ్జాకు భూభాకాసురులు ప్రయత్నం చేస్తున్నారని బాధితుడు అనంతా బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా తమభూమి సర్వే చేయమని అధికారులకు విన్నవించుకున్నామని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ న్యాయం చేయాలని కోరారు.

21న తారకరామ స్టేడియంలో...

10వేల మందితో యోగా : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తిరుపతి తారకరామ స్టేడియం నందు సుమారు 10 వేల మందితో పెద్ద ఎత్తున యోగాను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు 21వ తేదీ జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రజలు. పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కావాలని ఎస్.పి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తారకరామ స్టేడియం నందు సుమారు 10 వేల మంది తో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలని వివిధ శాఖలకు చెందిన అధికారులకు సూచించారు. మునిసిపల్ కార్పొరేషన్ వారు శానిటేషన్, తాగునీరు ఏర్పాటు, వైద్య ఆరోగ్య శాఖా వారు హెల్త్ క్యాంపు లు నిర్వహించాలని, జిల్లా పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రించాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు. పలు యునివర్సిటీల నుండి విద్యార్థులు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని వీసీలను ఆదేశించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని విద్యా శాఖా వారిని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులు కూడా హాజరయ్యేల చూడాలని తెలిపారు. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను తూచా తప్పకుండ పాటించాలని ఆదేశించారు.

పక్వానికి వచ్చిన మామిడి కాయల్ని కోయాలి

పలమనేరు ఆర్డీవో భవాని

గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ భవాని

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలను మాత్రమే కోత కోయాలని పలమనేరు ఆర్‌డిఓ భవాని తెలిపారు. బుధవారం మండలంలోని గుంతూరు, బంగారుపాళ్యం గ్రామాల్లో వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ తోతాపురి మామిడి పంటను పక్వానికి రాకముందే రైతులు కోతలు కోస్తున్నారని, దాని వలన గుజ్జు పరిశ్రమలో ఆలస్యమవుతోందని తెలిపారు. రైతులు పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రేమ కోసి పరిశ్రమలకు తరలించాలని సూచించారు. అనంతరం ర్యాంపులు మామిడి మండీలను పరిశీలించారు. తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

తోతాపురికి రూ.4లు ప్రభుత్వ మద్దతు ధర

సోమల: మండలంలోని మామిడి రైతులు తోతాపురి, బెంగళూరు రకం మామిడి పంటను జిల్లాలోని జ్యూస్ ఫ్యాక్టరీకి అమ్మినా ప్రభుత్వం నాలుగు రూపాయల మద్దతు ధర ఇస్తుందని దీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బెన్ను రాజు కోరారు. బుధవారం ఇరికిపెంట సచివాలయంలో మామిడి రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈవో మంజునాథ్ మాట్లాడుతూ జిల్లాలోని జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద మండీల వద్ద వేయింగ్ ర్యాంపుల వద్ద ప్రభుత్వ సిబ్బంది ఉండి రైతుల మామిడికాయలు అమ్మకం చేసే సమయంలో ఆధార్ కార్డు 1బి బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను అధికారుల వద్ద ముందుగా నమోదు చేయించుకుంటే అలాంటి వారికి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో పడుతుందని, రైతులు మామిడి పంట పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే తీసుకురావాలని మద్దతు ధర ఇచ్చి రైతుల వద్ద కొనుగోలు చేసే ప్రక్రియ ఆగస్టు వరకు కొనసాగుతుందని కావున రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ మామిడి కాయలను అమ్ముకోవచ్చునని ఫ్యాక్టరీలకు అమ్మేవారు ముందుగా వారి వద్ద నుండి టోకెన్ పొంది ఆ తర్వాత కాయలు కోసి అదే సమయానికి ఫ్యాక్టరీకి తీసుకువెళ్లడం వల్ల సమయం కలిసి వస్తుందని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస నాయుడు పంచాయతీ కార్యదర్శి మేనక, వీఆర్వో రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరంలోని ప్రభుత్వ ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం హెచ్ఎం కోటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ సంధాని పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 2024–25 పదవ తరగతి పరీక్షలో 500లకు పైగా మార్కులు 9 మంది విద్యార్థులు సాధించారన్నారు. హేమంత్, గీతిక షైనింగ్ స్టార్ అవార్డు సాధించారని, సంజన, మాధవ, హేమలత ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక అయ్యారని తెలిపారు. విద్యార్థులందరూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ఉమాశంకర్, పిఈటి మాండవ్వ, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీలోని ప్రభుత్వ స్కూల్స్‌లోని విద్యార్థులకు టిడిపి మండల అధ్యక్షులు బిఎం.రాధకిషోర్ గౌడు సర్వేపల్లి రాధకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి, భోజనం అందిస్తోందని విద్యార్థులు బాగా చదవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోదండరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్సోర్సింగ్ కార్మికులు గత ఎనిమిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విధితమే. బుధవారం పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డిని కలిసి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ వినతిపత్రాన్ని మున్సిపల్ కార్మికులు అందించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి కార్మికుల న్యాయమైన కోర్కెలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. కార్మికులు రాజా, వినాయక, ప్రసాద్, చిన్ని, అన్ఫో, తదితరులు పాల్గొన్నారు.

తోతాపురిని ప్రభుత్వ మద్దతు ధరకు కొనాల్సిందే

వ్యాపారులు సిండికేట్ అవ్వొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి రామచంద్రపురం (పాకాల): మామిడి రైతన్నలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామల చెరువు మామిడికాయ మండి వ్యాపారస్తులతో, రైతులతో జిల్లా ఎస్పీ సమావేశమయ్యారు. ర్యాంపులను పరిశీలించారు. వ్యాపారస్తులతో, రైతులతో మాట్లాడారు. కొనుగోలు, అమ్మకాలను గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తోతాపూరి రకం మామిడి చివరి కాయ అమ్మే వరకు రైతులను రాష్ట్ర ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. రైతులు పక్వానికి వచ్చిన మామిడికాయలను కోసి తరలించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారస్తులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కచ్చితంగా కొని తీరాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, పాకాల సీ.ఐ సుదర్శన్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాకాల దామలచెరువు మండీలో ఎస్‌పి తనిఖీలు

క్రైం న్యూస్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విద్యుత్ ఘాతానికి ప్రాణాలు కోల్పోయిన నాగప్ప (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- కుప్పం రూరల్: విద్యుత్ ఘాతానికి వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన కుప్పం మండలం నూలుకుంట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగప్ప చికెన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. బుధవారం చికెన్ శుభ్రపరిచే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురయ్యాడు గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అయితే అప్పటికే బాధితుడు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

వెంకటగిరిలో ముగ్గురిపై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

వెంకటగిరి మండలంలోని పాలెంకోట అడవిలో రెండు ఎలుగుబంట్లు బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ముగ్గురిపై దాడి చేశాయి. ఈ ఎలుగుబంటి దాడిలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.. మొక్కలపాడుకు చెందిన కఠారి అంకయ్య, కావడి మునెయ్యతోపాటు మరో వ్యక్తి కొండ కింద ఈత కాయల కోసమని అడవికి వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకున్నది. వారంతా తీవ్ర గాయాలతో వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతికి తరలించారు.

70 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ అటానమస్ కాలేజీ, టిటిడి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 70 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు అవసరం అని, కెరీర్‌ను సుస్థిరంగా కొనసాగించేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జగతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిందన్నారు. ఈ డ్రైవ్‌లో టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మసీ, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, బ్లింక్ ఇట్ సంస్థలు పాల్గొన్నాయని, 300 మంది విద్యార్థులు హాజరు కాగా 70 మందికి ఉద్యోగావకాశం లభించిందని తెలిపారు. జగతినెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జే.వాసుదేవనాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.భరత్‌కృష్ణ పాల్గొన్నారు.

'శ్రీ సాయి సుధా'లో ఉచిత బిఎండి పరీక్షలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత బియండి పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్ల నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి వారిచే ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని, ఎముకల సాంద్రత పరీక్షలు ప్రతి 3 నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు.ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

అలిపిరి టోల్‌ప్లాజా పునరుద్ధరణ టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆధునిక సౌకర్యాలతో అలిపిరి టోల్ ప్లాజా పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు టిటిడి ఈవో జె శ్యామల రావు తెలిపారు. తిరుపతి టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో అలిపిరి చెక్ పాయింట్ పునరుద్ధరణ, భద్రత పెంపుపై టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఈవో బుధవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా అలిపిరి టోల్ ప్లాజా వద్ద ఆధునిక సౌకర్యాలు, పటిష్ట భద్రత తదితర అంశాలపై జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన రాక్సా సంస్థ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భక్తుల చెకింగ్, లగేజీ స్కానింగ్‌కి ప్రస్తుతం తీసుకుంటున్న సమయం, దాని వల్ల వస్తున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. జీఎంఆర్ అనుబంధ సంస్థ అయిన రాక్సా సంస్థ ప్రతినిధులకు ఈవో సూచించారు. రాబోయే రెండు దశాబ్దాల పాటు భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక భద్రతా అంశాల ప్రతిపాదనలు సూచించాలని కోరారు. రాక్సా సీఈవో అమిత్ దార్, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సీవిఎస్వో మురళీ కృష్ణ, సీఈ సత్యనారాయణ, ఈఈ వేణు గోపాల్, ఐటీ జీఎం శేషారెడ్డి, వీజీవోలు సదా లక్ష్మి, రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PULLURU PURANDAR** (Old Name), S/o **P Reddeppa,** residing at D.No.5-9,Kothapalli Village, Bangarupalyam Post, Bangarupalyam Mandal,Chittoor Dist, AP hereby declare that I have changed my name as **PULLURU PURANDAR BABU** (New Name) for all future purposes.

DOCUMENTS MISSING

This is to certify that D.Nirup Kumar,, age 57 years S/o Late V.D.Jayaraj, R/o 15-2448, John's Garden, Chittoor who came to PS and lodged written report stated that he has lost his Passport at Chittoor, vide File NO.HY50695335 19516, Date of Issue: 8/8/2016, Date of Expire 7/8/2026 . In this regard efforts were made to trace out the same Chittoor and surrounding places, but in vain. Hence the applicant is advised to approach concerned authorities for further action. **Contact Details: D. Nirup Kumar, CELL: 9030205005**